ఇండియా టుడే - 8, మే 2001

# ఆకుపచ్చని ఆదర్శం

నేను ఆఫీసులో పని చేసుకుంటుంటే పక్కనున్న ఫోన్ మోగింది. ఎత్తాను. అవతలి నుంచి, 'మాధవరావు బావగారూ, నేను సారథిని' అంటూ మా బావమరిది తన మాటలకు శ్రీకారం చుట్టి, గొంతుకలో ఆనందం నింపుకుని, వాళ్ళ పెద్దమ్మాయి రాధకు పెళ్ళి సంబంధం స్థిరపడిందనీ, మగపెళ్లివారు తొందర చేసిన మూలంగా ఆ నెలలోనే ఫలానా తారీఖున ముహూర్తం పెట్టించామనీ చెప్పాడు. ఆ వార్త తన చెల్లెలూ, నా భార్య అయిన లలిత చెవినీ, పిల్లల చెవినీ వేయమని కోరాడు. మమ్మల్ని పెళ్ళికి రావడానికి సంసిద్ధం కమ్మని విన్నపాలు చేశాడు. నేను సారథితో పాటు ఆనందాన్ని పంచుకున్నాను. ఫోన్ పెట్టేశాను. చెప్పొద్దూ, నాకే తెలియకుండా నా గుండెల్లో చిన్నపాటి దడ మొదలయింది. పెళ్ళికి పది రోజులే వ్యవధే ఉంది. పైగా పెళ్ళి జరిగేది మద్రాసులో. గత రాత్రి డైరీలో రాసుకున్నవన్నీ కళ్ళ ముందు కదిలాయి. కొత్తగా కట్టిన ఇల్లు, దాని మీద చేసిన అప్పు, తీసుకున్న లోన్‌లు, పిల్లల చదువులు, చేతికి వస్తున్న బక్కచిక్కిన జీతం – అన్నీ గుర్తొచ్చాయి.

అయినా, తమాయించుకున్నాను. ఫోనెత్తి, ఇంటికి డయల్ చేసి లలితతో నేను అందుకున్న శుభవార్త గురించి చెప్పాను. లలిత గొంతుకలో పరమానందం వెల్లివిరిసింది.

"అంతా బాగానే ఉంది. కానీ, మన స్థితీ, పరిస్థితీ బాగా లేవు కదా" అన్నాను.

"అయితే మాత్రం" అని లలిత నవ్వేసి, 'బెట్టు ఒలకపోయకండి" అంది.

"సరేలే" అని ఫోన్ పెట్టేశాను.

ఆఫీసు అవగానే సరాసరి ఇంటికి వెళ్ళాను. లలిత వేడి కాఫీతో నాకు స్వాగతం పలికింది. నా పక్కన కూర్చుంది. తన అన్ననూ, వదిననూ, పెద్ద మేనకోడల్నీ తెగ గుర్తు చేసుకుంది.

"అది సరేనోయ్. మనం గుమ్మం దిగి బయటకు వెళ్ళే పరిస్థితి లేదు. ఇల్లు కట్టి అంతలా మునిగాం. ఏ లోనూ దొరకదు. ప్రయాణం ఎలా?"

సరిగ్గా అప్పుడే నా పక్కనున్న ఫోన్ మోగింది. ఫోనెత్తాను.

"నేను, అన్నయ్యను" అన్నాడు. విశాఖపట్నం నుంచి అన్నయ్య మాట్లాడుతున్నాడు.

"చెప్పు అన్నయ్యా"

"మన వేణుగాడికి ఆ మధ్య ఓ సంబంధం చూశాం గుర్తుందా? వాళ్ళది ఈ ఊరే. పేరు రాధారమణగారు. ఆ సంబంధం అన్ని విధాలా బాగుందనిపించింది. సరే అనేశాను. ఈ నెలలోనే పెళ్లి" అంటూ తారీఖూ అదీ చెప్పాడు. మరదలితో మాట్లాడాడు. ఆ తర్వాత మా వదిన నాతోనూ, లలితతోనూ మాట్లాడింది. లలిత తన అన్నగారింట పెళ్ళి గురించి చెప్పింది. ఆ పైన నాతో, "రెండు పెళ్ళిళ్ళకూ మధ్య రెండు రోజుల వ్యవధి ఉంది. ఫర్వాలేదు" అంది.

"కానీ, ఒకటి మద్రాసులో, మరొకటి విశాఖ పట్టణంలో... అదే ఫరవా..."

"మీరూ, నేనూ ఏం చేస్తాం? ఇబ్బందుల్లో ఉన్నాం కదా అని పెళ్ళిళ్ళకు వెళ్ళడం మానేయలేం కదా?"

అప్పుడే బయటి నుంచి వచ్చిన పిల్లలు విషయం తెలుసుకుని తెగ సంతోషపడ్డారు.

"నాన్నగారూ, మనం రెండు పెళ్ళిళ్ళకు వెడుతున్నాం. నాకు రెండు జతల బట్టలు కొనాల్సిందే." అంది వాసంతి.

"నాకు జీన్స్ పేంట్స్, లీ స్లేక్స్ కావాలి" గుణ అన్నాడు.

"మరి నీకు" అని అడిగాను లలితను.

"మీ ఓపిక" అని ఏదో గుర్తుకు వచ్చినట్టు, "మనం రెండిళ్ళలోనూ కానుకలు చదివించాలి. అవి ఘనంగా ఉండేటట్టు చూడండి చాలు."

"ఘనమైన కానుకలే ఇవ్వాలని ఎక్కడ ఉంది? గుర్తుండే వస్తువులు ఏవి ఇచ్చినా చాలు."

"అదేం బావుండదు. ఇక్కడ పిసినారితనం చేయద్దు. నలుగురూ నవ్విపోతారు" అంటూ లలిత తనదైన స్వరంతో సలహాల మాలలు అల్లుకుపోయింది.

అప్పుడు నాకు నా పెళ్ళిరోజున నా ప్రాణస్నేహితుడూ, ఆ పైన కవీ అయిన రాజు ఇచ్చిన బహుమతీ, అది పెళ్ళి పందిట్లో సృష్టించిన అలజడీ, ఆశ్చర్యం గుర్తుకు వచ్చాయి. నేను పెళ్ళి పీటల మీద నుంచి లేచిన తర్వాత రాజు నా దగ్గరకు వచ్చి, "మాధవా, మీ

అత్తారి తరఫువాళ్ళూ, మన ఫ్రెండ్స్ అందరూ నన్ను వింతగా చూస్తున్నార్రా. నీకు ఇలాంటి ప్రెజెంటేషన్ ఇవ్వకుండా ఉండాల్సింది. సారీరా" అన్నాడు.

"ఇందులో సారీ చెప్పడానికి ఏం ఉంది రాజూ? అయినా, జనాన్ని అడిగి, వాళ్ళందరూ ఓకే చేసింది తేవడం ఎవరివల్ల అవుతుంది?"

"నా ప్రాణ స్నేహితుడివయిన నీకు మన హృదయాలకు ప్రతిరూపమైనదీ, మనం పెద్దవాళ్ళమయినా, మనతోపాటు ఎదిగీ, నిన్ను నిత్యం పలకరిస్తూ నన్ను గుర్తు చేసేదీ నీకు ప్రెజెంటేషన్‌గా ఇవ్వాలనిపించింది. అందుకే ఇది కొని తెచ్చాను."

"నువ్వు నాకు రేర్ గిఫ్ట్ ఇచ్చావురా. ఏవరేం అనుకంటే మనకేంలే" అనేశాను నవ్వుతూ.

రాజు తృప్తిగా నా వైపు చూశాడు. పెళ్ళి అయిన అదే సాయంత్రం రాజు, భార్య కౌసల్యతో కలిసి బొంబాయి వెళ్ళిపోయాడు. నేను మూడునిద్రలకు లలితా వాళ్ళింట్లో ఉండిపోయాను. నాకు బాగా గుర్తు. మూడో రోజు తెలతెలవారుతుంటే - నాకన్నా ముందు లేచిన లలిత ఇంటి లోపలికి వెళ్ళి - నా కోసం వేడి వేడి కాఫీ తెచ్చి చేతికి ఇచ్చింది. తనకు కూడా కాఫీ తెచ్చుకుంది. ఇద్దరం కాఫీ తాగుతున్నాం. నేను ఆ అందమైన నిశ్శబ్దంలో రాత్రి జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్నాను. లలితను చూస్తే మాత్రం మామూలుగానే కనిపించింది. అది బహుశా గుంభన అయుంటుంది.

"అవునూ, ఒక మాట అడగనా" అంది నెమ్మదిగా లలిత.

"మీ స్నేహితులు, అదే రాజుగారు అలాంటి ప్రెజెంటేషన్ ఇచ్చారేమిటి" అని ఆగిపోయింది.

"నీకు అది నచ్చలేదా?"

"నచ్చడం కాదు. చాలామంది దాన్ని అదోలా చూశారు" అని తిరిగి "ఆయన ఉన్నవారు కాదా" అని ప్రశ్నించింది.

"నాతో పోలిస్తే కలిగినవాడు. అలాగని లక్షలకు అధికారి కాదు."

"మరి?"

"వాడు కవి. ఆ పైన అరాధకుడు. ముఖ్యంగా వర్డ్స్‌వర్త్‌లా ప్రకృతి అంటే ప్రాణం పెడతాడు. అందుకే వాడి చర్యలన్నీ అలానే ఉంటాయి."

"లలిత మాట్లాడలేదు. నేనూ మరీ రెట్టించి లలితను తిరిగి ప్రశ్నించలేదు.

❖ ❖ ❖

డబ్బు కోసం నలుగురైదుగురు స్నేహితుల్ని అడిగాను. లోన్ మీద లోన్ దొరుకుతుందేమోనని మా పి.ఎఫ్. సెక్షన్‌లో వాకబు చేశాను. లాభం లేదని తేలిపోయింది. దారి ఖర్చులూ, గిఫ్ట్‌ల ఖరీదు, లలితకూ, పిల్లలకు కొనవలసిన కొత్త బట్టలు, అన్నిటికీ కలిపి ఏడు, ఎనిమిది వేలు చేత్తో పట్టుకోవలసి వచ్చేటట్టుంది. అదే విషయం ఆ రాత్రి లలితతో చెప్పాను.

"ఏం చేస్తాం తప్పదు కదా."

"ఏం చేయమంటావ్?"

లలిత ఓ క్షణం ఆగి, "ఒకటే దారి, అప్పు చేయడమే. కుదరకపోతే పెళ్ళిళ్ళకు వెళ్ళడం మానేయడమే" అంది.

"బాగా ఆలోచించు. మధ్యేమార్గంగా మరో దారి ఏదైనా దొరకవచ్చు."

లలిత ఓ రెండు నిముషాలు ఆలోచించి, "నాకేం తోచడం లేదు"

"పోనీ ఓ పని చేస్తే?"

"చెప్పండి"

చేతులకు ఆరు గాజులూ, నీ మెడలో చంద్రహారాలూ, వాసంతి చేతికి రెండు గాజులూ ఉన్నాయిగా. అవి బ్యాంక్‌లో పెట్టి లోన్ తీసుకుందాం."

"బావుందండీ! మంచి ఆలోచనే. పెళ్ళికి వెడుతూ బోసి మెడతో వెడితే ఏం బావుంటుంది? అందరి ముందు పరువు పోదా?"

నేను మాట్లాడలేదు.

"ఓ మాట చెప్పనా?"

"చెప్పు"

"మీ స్నేహితులు రాజుగారు ఉన్నారుగా. బొంబాయి ఫోన్ చేసి ఆయన్ని అడగండి. ఉన్నవాడే కదా. తప్పకుండా సహాయం చేస్తారు."

"వాడినా?"

"తప్పేం ఉంది. ఓ రెండు మూడు నెలల్లో తీర్చేద్దురుగాని. మీకు ఎలాగూ ఎరియర్స్ వస్తాయన్నారుగా" అంటూ లలిత ఆవులించింది. ఆ పైన నా పక్కన చోటు చేసుకుని పడుకుంది. నెమ్మదిగా తన శరీరాన్ని నిద్రపాలు చేసింది. నేను గడియారం వైపు చూశాను. పదకొండు గంటలయింది. రాజు ఫోన్ నంబర్ తిప్పాను. అన్నీ చెప్పాను. వాడు నే చెప్పిందంతా విని, "నేనున్నాను, భయపడకు" అని భరోసా ఇచ్చాడు. నా మనసు కాస్త తెరపిన పడ్డం మూలంగా హాయిగా మాట్లాడగలిగాను వాడితో. ఆ పైన నాకు తెలియకుండానే నేనూ నిద్ర వాతపడ్డాను.

❖ ❖ ❖

మద్రాసులో మా బావమరిది, సారథి తన కూతురు రాధ పెళ్ళి ఘనంగా చేశాడు. పెళ్ళి కొడుకును చూసీ, అతగాడు చేసే ఉద్యోగం గురించి వినీ అంతా సంబరపడ్డారు. సారథి నాకూ, లలితకూ, పిల్లలకే కాకుండా బంధువులందరికీ బట్టలు పెట్టాడు. "ఎందుకివన్నీ" అంటూ మేం వాటిని తీసుకున్నాం.

ఆ సాయంకాలం మేం విశాఖపట్నం వెళ్లే రైలు ఎక్కాం. లలిత ఏదో ఆలోచిస్తోంది. పిల్లలు వాళ్ళ కబుర్లలో వాళ్ళున్నారు.

"ఏమిటి అలా ఉన్నావ్" అన్నాను నేను.

లలిత తేరుకుని నెమ్మదిగా తన అన్నగారికి కూతురు పెళ్ళి పేర అయిన ఖర్చూ, ఆ వివరాలూ చెప్పి, "పాడు రోజులు. ఇంకో రెండేళ్ళలో రెండోది కూడా ఎదిగి కూర్చుంటుంది. ఎలా ఈదుకొస్తాడో" అంది.

"అన్నిటికీ, అందరికీ బాధ్యత పట్టేవాడు పైన ఉన్నాడు. బాధపడకు."

లలిత నవ్వి, "బాగానేఉంది వేదాంతం" అంది.

"అవునూ" అనేశాను చటుక్కున.

"ఏమిటి అవునూ?"

"మా రాజుకు ఉదయం యథాలాపంగా ఫోన్ చేశాను. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, రాజుగారి బార్య కౌసల్యగారికి మా అన్నయ్య వియ్యంకుడు బంధువర్గంలో మనిషట. పెళ్ళికి వాళ్ళూ వస్తున్నారట."

"అలానా, చాలా బావుంది. నేను అవిణ్ణి ఎప్పుడో చూశాను. మళ్ళీ చాలా కాలం తర్వాత కలవబోతున్నాం అన్నమాట."

అప్పుడే పిల్లలు కూడా మా మాటల్లో మాటలు కలిపారు. మా అమ్మాయి వాసంతి ఏదో గుర్తు చేసుకుని, "అవును నాన్నగారూ, అమ్మ అప్పుడప్పుడు రాజు అంకుల్ గురించి చెప్తూ ఉంటుంది. ఆయన మీ పెళ్ళిలో మీకో గమ్మత్తయిన బహుమతి ఇచ్చారనీ, అదే మన ఊళ్ళో వున్న మనింటి ముందు పెద్ద పందిరి మీద పాకిన తెల్ల గులాబీ క్రీపర్ మొక్క అనీను. అది వయసులో నాకు అక్క అవుతుందని మీరూ చాలాసార్లు అనేవారు. గుర్తుందా" అంది.

"అవునమ్మా, మరే వస్తువయినా అది ఈపాటికి ఏమయ్యేదో! వాడు ఆనాడు ఇచ్చిన చిన్న మొక్క ఈ వేళ చిలవలూ పలవలూ వేసి మనకు తోడుగా ఉంది కదూ" అన్నాను.

వాసంతి తల ఊపింది. లలిత నవ్వింది.

❖ ❖ ❖

విశాఖపట్నంలో – మేం ఫంక్షన్ ప్రాంగణంలోకి అడుగు పెట్టకుండానే మా అన్నయ్య వియ్యంకుడు రాధారమణగారు మాకు ఎదురొచ్చి ఆహ్వానాలు పలికారు. తన తాలూకు చుట్టాలను పేరుపేరునా పరిచయం చేశాడు. అంతటితో ఊరుకోకుండా నేను కథా రచయితననీ, సాహిత్యం అంటే చెవి కోసుకునే వాళ్ళలో ప్రథముడిననీ గొప్పగా చెప్పి, అంత గొప్పగానూ నా వైపు చూశాడు. చెప్పొద్దూ. నేనయితే మొహమాటంతో నోరు తెరవలేకపోయాను. నేను కథలు రాయడం మానేసి పదేళ్ళయింది. నన్ను చాలా మంది రచయితగా పోల్చుకోరు. నేనూ ఆ అవకాశం ఎవరికీ ఇవ్వను. నిజానికి పల్లెటూర్ల జనాన్ని అవతలి గట్టు నుంచి ఇవతలి గట్టుకు నిత్యం తన వంతు సేవ చేసే బల్లకట్టుతో తెలుగు రచయితల్ని పోల్చవచ్చుననుకుంటాను. మరమ్మత్తుల పాలుకాకుండా పనిచేసినంత

కాలమే బల్లకట్టుకు ఊపూ, ఉనికీ కథలకు కూడా రాసినంత కాలమే గుర్తింపు. రాయడం మానేస్తే అదే అతగాడికి ముగింపు.

నేను ఆ విషమ పరిస్థితిలో పడి ఉక్కిరిబిక్కిరి కాకుండా ఉండడం కోసమే అన్నట్టుగా వెనక నుంచి రాజు వచ్చి "మాధవా" అంటూ నా భుజం మీద చెయ్యి వేశాడు. నేను రాజు వైపు చూశాను. తన కవిత్వానికి ప్రతీకలుగా గ్లాస్కో పంచె, పెద్దాపురం సిల్కు లాల్చీ వేసుకున్నాడు. వయసు మీద పడుతుంటే - దాన్ని ధైర్యంగా ఎదుర్కోవడానికన్నట్టు ముఖ్యంగా చత్వారాన్ని చెంపదెబ్బ కొట్టడానికన్నట్టు కళ్ళకు బంగారు ఫ్రేం కళ్ళ జోడు. ఉంగరాల జుట్టులో అక్కడక్కడా నెరసిన జాడలు.

ఇద్దరం చేతులు కలుపుకున్నాం. మాటలకు శ్రీకారం చుట్టబోయాం సరిగ్గా ఆ సమయంలో మా అన్నయ్య అటు వస్తే రాజును పరిచయం చేశాను. అన్నయ్య రాజును గుర్తు పట్టడానికి కొద్దిగా కిందా మీదా అయి "రాజుగారంటే కవి కదూ. పొయిట్రీ రాస్తారు. నీ స్నేహితులు. గుర్తొచ్చింది" అంటూ పెద్దగా నవ్వి తిరిగి అన్నాడు. "ఆనాడు నీ పెళ్ళికి వచ్చి సరికొత్త కానుక ఇచ్చి మా అందరి కళ్ళూ, నోళ్ళూ పెద్దవి చేశారు కదూ ఈయన."

"అవునన్నయ్యా. అప్పుడు రాజు ఇచ్చిన చిన్న తెల్ల గులాబీ మొక్క ఇప్పుడు మా ఇంటి ముందు పెరిగి పెద్దయి, పందిరెక్కి విశాలమై రోజూ మాకు ఆనందాన్నీ, ఆహ్లాదాన్నీ, ఆ పైన పరిమళాన్నీ అందజేస్తూనే ఉంది."

సరిగ్గా లలిత అటు వచ్చింది. నేను లలితకు రాజును చూపించి, "ఈయనెవరో గుర్తుందా" అని అడిగాను. లలిత మొహం సంశయమనమయింది.

"మన తీగ గులాబీ చెట్టుకు దత్తత తండ్రి రాజుగారు."

"అవునవును. నమస్కారం అన్నయ్యా, బావున్నారా" అంటూ లలిత రాజును కుశల ప్రశ్నలు వేసింది. రాజు తల ఊపాడు.

"నువ్వు సమయానికి ఆదుకోబట్టే మేం ఇలా పెళ్ళిళ్ళకు రాగలిగాంరా. చాలా థ్యాంక్స్" అన్నాను.

"ఊరుకుంటావా మాధవ మహాశయా" అన్నాడు రాజు. "అన్నయ్యగారూ, మా వదిన కౌసల్యగారు ఎక్కడ. కనబడరేం?"

"మేం ఆడపెళ్ళివాళ్ళం కదా? అందుకే మా ఆవిడ గట్టిగా నడుం బిగించింది. లోపల ఉంది. మీ చేతిలో ఉన్నది ఓ గంట టైము. ఆమెను ఆట పట్టిస్తారో, డాన్స్ చేయిస్తారో మీ యిష్టం."

"మగపెళ్ళివారు కదా అని లేని స్వాతంత్ర్యం తీసుకుని ఆధారిటీ చేయడం అన్యాయం" అన్నాను నేను.

రాజు నవ్వాడు. ఇంతలో ఇద్దరు యువకులు వచ్చారు అక్కడికి. ఇద్దరూ నాకు,

రాజుకు పెద్దవాళ్ళు పిలుస్తున్నారని హెచ్చరిక అందజేశారు. మేం ఇద్దరం విడిదికి అటూ ఇటూగా వున్న గదుల్లోకి వెళ్ళక తప్పలేదు. సరిగ్గా అప్పుడే లలిత, రాజు భార్య కౌసల్యా కలిసి మాట్లాడుకుంటూ మా పక్క నుంచి వెళ్ళడం నా కంట పడింది.

❖ ❖ ❖

గంట తర్వాత మా అన్నయ్య కొడుకు వేణు పెళ్ళి అయింది. పెళ్ళి తంతులోని ప్రతీ ఘట్టం చిరస్మరణీయంగా అనిపించింది. ఆ రాత్రి అర్ధరాత్రి అయ్యేవరకూ పెళ్ళి చేయించిన బ్రహ్మగారు కొత్త దంపతుల్ని నాగవల్లి, సదస్సు, బంతులాట, అలకపాన్పులాంటి కార్యక్రమాల్లో భాగస్వాముల్ని చేశాడు. నవ్వుతూనే. "ఇలాంటివన్నీ కొత్త జంటను అతి దగ్గరగా చేసే చిట్కాలు"అని వివరణ కూడా ఇచ్చాడు. ఆఖరిగా అప్పగింతల తంతు. మగపెళ్ళివారమైన మేం ముఖ్యులుగా కుర్చీలో కూర్చున్నాం. రాధారమణగారూ, ఆయన భార్యా పెళ్ళికూతుర్ని తీసుకువచ్చి, ఆమె చేతులు పాలల్లో ముంచుతూ వేణుతో మా అందరికీ పేరుపేరునా ఒప్పగించారు. పెళ్ళి తంతులో వింతైనదీ, ట్రాజీ కామెడీలను తేలికపాటిగా ఒకరాటను కొద్ది క్షణాలు కట్టిపారేసేది అప్పగింతల తంతే! నవ్వులతో నలిగే పెదాల మీద రేఖా మాత్రంగా బాధా పరితప్తత. ఆనందంతో ఉప్పొంగే కళ్ళలో - అంతలోనే వ్యధ - తన ఉనికిని చటుక్కున దృశ్యమాత్రంగా ప్రతిఫలించడం. మేం అందరం పెళ్ళికూతురు శోభని, ఆమె తల్లితండ్రుల్ని, అక్కనూ, అన్ననూ ఓదార్చాం. "శోభ కోడలుగా మా ఇంటి మనిషయినా, మీ ఇంటి ఆడబడుచే"నని నచ్చచెప్పాం!

పది నిముషాల్లో అన్ని తంతులూ పూర్తి అయ్యాయి. అప్పటికే మా అందరి కళ్ళలోకి నిద్ర ముంచుకు రాసాగింది. రాజూ,కౌసల్యా అప్పటికే ఆ హాల్లో ఓమూలగా నైలాన్ చాపల మీద పడుకుని ఉన్నారు. నేనూ లలితా ఓ పక్కగా వెళ్ళి కూర్చున్నాం. లలిత పక్కలు వేస్తోంది.

"పెళ్ళి అయింది. తెల్లవారగానే ఈ ఫంక్షన్ హాలు ఖాళీ చేయాలిట. మనం తప్పించి అందరూ కానుకలు చదివించారు. మీరేమిటీ గమ్మున ఉండిపోయారు".

"వేణుకు ఏం కొనాలో తెలియడం లేదు."

"బావుంది హాస్యం."

"నిజమే. నేను కొన్నది నువ్వు మెచ్చవు. నీకు నచ్చింది నాకు నచ్చకపోవచ్చు."

"అయితే, వేణుకు ప్రజంటేషన్ నేను కొంటాను. రేపు సత్యనారాయణ వ్రతం టైములో ఇద్దాం సరేనా?"

"సరే" అన్నాను.

'ఏం కొనబోతున్నావని అడగరా?"

"నీ తాహతుకు తగ్గది కొంటావు. నాకు తెలియదా"

నేను నవ్వి ఊరుకున్నాను.

❖ ❖ ❖

మర్నాడు ఉదయం ఫంక్షన్ హాలు ఖాళీ చేసి అందరం మా అన్నయ్యగారింటికి వెళ్ళాం. తొమ్మిది గంటలకు వధూవరులు సత్యనారాయణ వ్రతం పీటల మీద కూర్చున్నారు. ఆ వ్రతం ఓ గంట పైగా సాగింది. ఆ తర్వాత అందరం భోజనాలు చేశాం. నేనూ, రాజు ఓ గదిలోకి వెళ్ళి పాత జ్ఞాపకాలను నెమరువేసుకోవడం మొదలుపెట్టాం. సాయంకాలం ఇద్దరం ఊర్లోకి వెళ్ళి కాసేపు తిరిగి వద్దామనుకుని, ఆ కబురు నేను లలితకు, రాజు కౌసల్యకూ చెప్పాం.

"బాగానే ఉంది. మనం ఇలా షికార్లు కొడితే మీ అన్నయ్యగారూ, అక్కయ్యగారూ ఏమన్నా అనుకుంటారు."

"అలా అంటావా?"

"కొత్త జంట బీచ్‌కి వెడతారుట. మన పిల్లకాయలు వాళ్ళకి తోడుగా వెడతారు"

"బావుంది"

"మనం ఇంకా వాళ్ళకు బహుమతి ఇవ్వలేదు. ఇప్పుడు ఆ పని కానిస్తే బావుంటుంది."

"నేను ఏం కొనలేదు. ఎలా?"

"నేనూ, కౌసల్యగారూ బజారుకి వెళ్ళి ఆ పని కానిచ్చాం."

"ఇంకేం వాళ్ళని పిల్చి అది వాళ్ళచేతుల్లో పెట్టెయ్. మన పని అయిపోతుంది. నీ ఆత్రం తగ్గుతుంది".

"సరే"

"ఏం కొన్నావ్ ఇంతకీ?" లలిత లోపలి గదిలోకి వెళ్ళింది. తిరిగి వచ్చింది. అప్పుడు ఆమె చేతుల్లో ఓ చిన్న పూలకుండీ ఉంది. ఆ కుండీలోని చిన్న మొక్క అతి చిన్నగా ఊగుతోంది. రెండు చేతులతో కుండినీ పొదివి పట్టుకుని వస్తూన్న లలిత మాతృమూర్తిలా ఉంది. ఆశ్చర్యంగా "ఇదేమిటి" అనేశాను.

"సంపెంగ మొక్క, బావుందా?"

నేను లలితను చూసి ఆశ్చర్యపోయాను. నాలో నా ఆశ్చర్యాన్ని ఆనుకుని చిన్నదైన ఆనందం కూడా ఎదుగుతోందనిపించింది. అలాగే రాజు వైపు చూశాను.

"రాజూ, ఈ సంపెంగ మొక్క గుణం, సందేశం ఏమిటోయ్" అని అడిగాను.

"బహుశా సంపెంగ ఆంతర్యం తెలియకుండా ఆవిడ దాన్ని కొని ఉండరు" అన్నాడు రాజు చిన్నగా.

"లేదు అన్నయ్యగారూ. నిన్న మీరు, మా వదిన కౌసల్యగారితో పువ్వుల గురించి చెప్తుంటే విన్నాను. ఆశ్చర్యం, ఆనందం నన్ను ఉక్కిరిబిక్కిరి చేశాయి. అందుకే కౌసల్యగారితో వెళ్ళి ఇది కొన్నాను."

"అలానా" అనేశాను.

"ప్రతీ పుష్పానికీ ఒక్కో ప్రత్యేక గుణం ఉంటుంది మాధవా. అవి తమకే ప్రత్యేకమైన గుణగణాలతో మనల్ని ప్రభావితం చేస్తాయి. వాటిని మనకు దగ్గరగా ఉంచుకోగలిగితే అవి మనలో రాగద్వేషాలను దూరం చేసి మనల్ని సమతలం చేస్తాయి. అయితే, ఈ సంపెంగల ప్రత్యేకత ఏమిటంటే, ఇవి పరమాత్మ దరహాసాలను తెచ్చి మనకు అందించే బృహత్ కార్యాన్ని చేపడతాయిట."

సరిగ్గా అప్పుడే లోపలి నుంచి వేణూ, వాడి భార్య శోభా అక్కడికి వచ్చారు. వాళ్ళిద్దర్నీ చూసి లలిత నవ్వుతూ వాళ్ళకు దగ్గరగా వెళ్ళి, "వేణూ" అంటూ కొత్త దంపతులను పక్క పక్కన నిలబడమని సౌంజ్ఞ చేసి, తన చేతిలోని పూల కుండీని వాళ్ళ చేతుల్లో పెట్టి,"ఇది మీ బాబయ్యా నేనూ మీకు ఉమ్మడిగా ఇచ్చే కానుక. ఇలాంటి కానుకలు అందుకోవడం, వాటిని ఎలా భద్రంగా కాపాడుకోవాలో ఆ విషయాలన్నీ ఆయనే చెబుతారు" అంది.

వేణూ,శోభా మొదట ఆశ్చర్యపోయినా, వెంటనే తేరుకుని నవ్వేవారు. "అవునురా వేణూ, మా రాజు సహృదయం మా ఇంట ఈనాటికీ అమరంగా, అజేయంగా తీగ గులాబీగా, అందునా తెల్లని పుష్పాలను అందిస్తూనే ఉంది. ఈ వేళ లలిత పిన్ని, రేపు నువ్వూ, శోభా, ఎల్లుండి మరొకరు తమ పిల్లలతో పాటు పువ్వుల్ని ప్రసాదించే చెట్లను సాకే వారసత్వానికి ఒరవడి పెట్టాలి" అన్నాను.

రాజు నవ్వాడు. కౌసల్య నవ్వింది.

లలిత మాత్రం తల వంచుని అతి చిన్నగా మాత్రమే నవ్వింది.

❖ ❖ ❖

మేం తిరిగి ఊరుకు చేరిన రాత్రి లలిత నన్ను ఒంటరిగా చూసి, "ఓ పని చేస్తారా" అని అడిగింది. నేను ఏమిటన్నట్టుగా ఆమె వైపు చూశాను.

"నా చంద్రహారాలూ, గాజులూ, వాసంతి గొలుసూ రేపు బ్యాంక్‌లో పెట్టి డబ్బు తీసుకుని, దాన్ని వెంటనే రాజుగారికి పంపించండి" అంది నెమ్మదిగా.

"అదేమిటీ, వాడు డబ్బు గురించి నన్ను తొందరపెట్టలేదే"

"అది కాదండీ. నేను మనిళ్ళల్లో పెళ్ళిళ్ళకు ఈ నగలతో వచ్చాను. కానీ, కౌసల్యగారు వట్టి పుస్తెల తాడుతో పెళ్ళికి వచ్చారు. అయినా, ఆవిడ కళ్ళల్లో నాకు చింతగానీ, సిగ్గు గానీ కనబడలేదు. ఆమెలో హుందాతనం, నిండుదనమే కనిపించాయి. ఇప్పటి నుంచైనా ఆవిడలా ఉండడం నేర్చుకుంటాను" అంది.

ఆ క్షణాన నాకు మాటలు రాలేదు! చాలాసేపు మౌనవ్రతుడిగా ఉండిపోయాను.

(దేవరాజు వేంకటకృష్ణారావుగారి స్వర్ణపతకాన్ని పొందిన కథ)

❖